# 69

# పునరుత్థానము

## (28:1-15)

క్రీస్తు పునరుత్థానము, ఆయన నిజముగా మరణమును జయించిన విజేతయై యున్నాడని చూపించుచు (28:1-7), మత్తయి సువార్త రచయిత నివేదించుచున్న సువార్త కథకు పరాకాష్ఠగా ప్రయోజనపడుచున్నది! ఆ నాటి ఆదివారం నాడు పునరుత్థానుడైన క్రీస్తును ఎదుర్కొనిన స్త్రీలు భక్తి భావముతోను ఆయనను ఆరాధించుచును ఆయన యెదుట తమ తలలు వంచి ఆయనకు నమస్కరించారు. వారు ఆయనను గలిలయలో, కలిసికొనవలెనని వీరు వెళ్లి శిష్యులకు తెలియజెప్పవలెనని ఆయన వారికి ఆదేశములిచ్చాడు (28:8-10). ఈ మధ్య కాలములో, రోమా ప్రభుత్వ కాపలాదారులు ఖాళీ సమాధి గూర్చిన సత్యము బయటికి రాకుండా అణచివేయవలెనని వారికి యూదుల నాయకుల చేత లంచమియ్యబడినది (28:11-15). యేసు క్రీస్తు తన శిష్యులను గలిలయలో అధికారపూర్వకముగా కలిసికొని వారికి మహా ఆదేశమును - రాజాధిరాజు యొక్క ఆధ్యాత్మిక రాజ్యము కొరకు వారు యుద్ధ ప్రాతిపదికను బయలు దేరవలసిన ఆజ్ఞను - జారీ చేసిన సంఘటనతో మత్తయి వ్రాసిన సువార్త ముగియుచున్నది (28:16-20).

### ఖాళీ సమాధి (28:1-7)

**1విశ్రాంతిదినము గడచిపోయిన తరువాత ఆదివారమున, తెల్లవారుచుండగా మగ్దలేనే మరియయు వేరొక మరియయు సమాధిని చూడవచ్చిరి. 2ఇదిగో ప్రభువు దూత పరలోకమునుండి దిగివచ్చి, రాయి పొర్లించి దానిమీద కూర్చుండెను; అప్పుడు మహాభూకంపము కలిగెను. 3ఆ దూత స్వరూపము మెరుపువలె నుండెను, అతని వస్త్రము హిమమంత తెల్లగా ఉండెను. 4అతనికి భయపడుటవలన కావలివారు వణకి చచ్చినవారివలె నుండిరి. 5దూత ఆ స్త్రీలను చూచి-మీరు భయపడకుడి, సిలువ వేయబడిన యేసును మీరు వెదకుచున్నారని నాకు తెలియును; 6ఆయన ఇక్కడ లేడు; తాను చెప్పినట్టే ఆయన లేచి యున్నాడు; రండి ప్రభువు పండుకొనిన స్థలము చూచి 7త్వరగా వెళ్లి, ఆయన మృతులలోనుండి లేచియున్నాడని ఆయన శిష్యులకు తెలియజేయుడి; ఇదిగో ఆయన గలిలయలోనికి మీకు ముందుగా వెళ్లు చున్నాడు, అక్కడ మీరు ఆయనను చూతురు; ఇదిగో మీతో చెప్పితిననెను.**

**వచనము 1.** స్త్రీలు యేసు సమాధి యొద్దకు ఎప్పుడు బయలుదేరారో వివరించుచున్నది, కాలక్రమానుగతమైన గమనిక ఒకటి చేర్చబడి యున్నది: **విశ్రాంతి దినము గడిచిపోయిన తరువాత, ఆదివారమున తెల్లవారుచుండగా ...** ఇంత కంటె ఇంకా ఎక్కువ ప్రాముఖ్యముగా, యేసు మృతులలో నుండి పునరుత్థానుడై లేచిన సమయమును గుర్తించుటకు ఈ ప్రస్తావన ప్రయోజనపడుచున్నది. "విశ్రాంతి దినము గడిచిపోయినది,

ఆదివారము తెల్లవారుచుండినది" అని NEB బైబిల్ సెలవిచ్చుచున్నది.

గతములో, ఇచ్చటి ప్రస్తావన ఆదివారం ఉదయానికి బదులుగా శనివారం సాయంకాలాన్ని సూచించుచుండినదని వాదింపబడినది. "తరువాత" అని అర్థమిచ్చుచున్న గ్రీకు పదము (*opse*) కొన్ని పర్యాయములు ఒక క్రియావిశేషణంగా ప్రయోగింపబడుచున్నది; అట్టి సందర్భములలో, అది "మామూలు వేళ దాటిపోయినదని" లేక "పొద్దుపోయిన తరువాత" అని అర్థమిచ్చును. ఏది ఏమైనా, ఇచ్చట ఈ మాట "తరువాత" అని అర్థమిచ్చు పూర్వసర్గముగా ప్రయోగింపబడినది.[1] దీనికి తోడుగా, "తెల్లవారుచుండగా" అని అనువదింపబడిన క్రియా పదము (*epiphōskō* నుండి) "దాటిపోనైయుండిన మామూలు వేళ ముగింపునకు వచ్చుచుండగా" అని అనువదింపబడవచ్చును, కానీ ఈ సందర్భములో "వెలుగుచుండు" లేక "తెల్లవారు" అను అర్థము సముచితముగా సరిపోవుచున్నది.[2] మొదటి వచనములో *sabbatōn* బహువచనము రెండు పర్యాయములు అగుపించుచున్నది. మొదటి మాట "విశ్రాంతి దినము"ను (ఏడవ దినమును) సూచించుచున్నది, అటుతరువాత "ఆదివారము"[3] (వారములోని తొలి రోజున) పదజాలములో అది "వారము"ను (ఏడు రోజులను)[4] సూచించుచున్నది.

స్త్రీలు సమాధి యొద్దకు విశ్రాంతి దినమున రాలేదు, ఏలయనగా అది విశ్రాంతి తీసికొనవలసిన దినమై యుండినది (లూకా 23:56). వారు విశ్రాంతి దినము ముగిసిన తరువాత (ప్రస్తుత శనివారము సాయంకాలము) రాలేదు, ఏలయనగా అప్పటికే చీకటి పడుచుండును. దానికి బదులుగా, ఆదివారమున పెందలకడనే వచ్చారు. వారు "ఆదివారమున పెందలకడ (లేచి, బయలుదేరి) సూర్యోదయమైనప్పుడు సమాధి యొద్దకు వచ్చారని" మార్కు చెప్పుచున్నాడు (మార్కు 16:2; NIV). "ఆదివారమున తెల్లవారుచుండగా" అని లూకా చెప్పుచున్నాడు (లూకా 24:1).[5] ఈ స్త్రీలు వేకువ జాముననే సమాధి యొద్దకు వచ్చుట – వారికి ఆ దినాన లభించిన మొట్టమొదటి తరుణముగా – వారు క్రీస్తు యెడల కలిగియుండిన భక్తిమర్యాదలకు మరొక సంకేతమై యున్నది.

ఇచ్చట **మగ్దలేనే మరియ మరియు వేరొక మరియ** మాత్రమే పేర్కొనబడి యున్నారు. యేసు తన ప్రాణమును కోల్పోవుటను వారు దూరముగా నుండి గమనించుచుండిరి, మరియు ఆయన దేహము ఎచ్చోట పాతిపెట్టబడినదో కూడ వారు చూసారు (27:55, 56, 61పై గల వ్యాఖ్యానములను చూడు). మార్కు ఈ స్త్రీల జాబితాలో సలోమేను చేర్చాడు (మార్కు 16:1), అయితే లూకా యోహన్నయు "యితర స్త్రీలు"ను చేర్చాడు (లూకా 24:10; 8:3 చూడు).

ఈ స్త్రీలు **సమాధిని చూడ వచ్చిరి.** ఇంకా నిర్దుష్టముగా చెప్పుకొంటే, వారు యేసు దేహమునకు సుగంధద్రవ్యములు పూయవలెనని వచ్చారు (మార్కు 16:1). అరిమతయియ యోసేపు మరియు నీకొదేము యేసు దేహమునకు సుగంధద్రవ్యములు అదివరకే పూసారు (యోహాను 19:39, 40), కానీ సాయంకాలము ఆరు గంటలకు విశ్రాంతిదినము ప్రారంభము కాకమునుపే యేసు దేహమును పాతిపెట్టవలెనను ఆతురతతో ఈ పని చేసారు. గనుక స్త్రీలు ఇప్పుడు ఇంకా మంచిగా/సరిగా పూయవలెనని ఆశించుచుండిరి.

వారు సమాధి యొద్దకు వచ్చుచుండగా, సమాధి ద్వారమును భద్రము చేయుటకు ఉంచబడిన రాయిని వారి కొరకు ఎవరు పొర్లిస్తారని వారిలో వారు చర్చించుకొనుచుండిరి

(మార్కు 16:2, 3). యూదుల నాయకులు వెలిబుచ్చిన ఆందోళన మేరకు రాతికి రోమా ప్రభుత్వ ముద్రవేసి సమాధిని భద్రము చేసి, సమాధి ద్వారము యొద్ద కావలివారు ఉంచబడునట్లు పిలాతు ఉత్తరువులు జారీ చేసిన విషయము వారికి ఎరుక లేదు (27:62–66). నిస్సందేహముగా యేసు దేహము సమాధిలో ఉండునని వారు ఆశించారు.

**వచనము 2.** సంభవించుచుండిన సంఘటనలలో గల ఉత్తేజమును తెలియజెప్పుటకు **ఇదిగో** అని అనువదింపబడిన గ్రీకు పదము (*idou*) మరలా మరలా ప్రయోగించబడినది (28:2, 7, 9, 11, 20). ఆ సమయంలో, **మహా భూకంపము** ఆ ప్రదేశమును వణికించినది. మైఖల్ జే. విల్కిన్స్ చెప్పుచున్నదాని ప్రకారము, "పాలస్తీనా దేశము భూకంపములకు తరచుగా గురియగుట గాని భౌగోళిక ముఖ్య లక్షణములలో ఒకటై యుండినది." ఈ విషయము మరి విశేషంగా నిజమై యున్నది "ఎందుకనగా భూమి మెరక భాగం లోపలికి కుంగిపోవడంవల్ల ఏర్పడిన నిటారుగా నున్న యోర్దాను లోయ, అకాబా సముద్రపు పాయ ప్రవేశద్వారము నుండి ఉత్తర దిశగా సుమారు 683 మైళ్లు తౌరస్ పర్వతశ్రేణి పాదము వరకు విస్తరించి యుండినది, భూమి పొరల వరుసలో క్రమభంగం చూపించు ప్రదేశములో ఒక భాగమై యున్నది."[6] ఏది ఏమైనా, ఈ భూకంపము మామూలు భూకంపము కాదు. **అప్పుడు** అని అనువదింపబడిన గ్రీకు సముచ్చయము (*gar*) ఒక హేతువును సూచించుచున్నది. ఆ మహా భూకంపమునకు **పరలోకము నుండి దిగి వచ్చిన దూత** బాధ్యుడై యుండెను. దేవుడు మరియు దేవుని దూతలు అగుపించుచుండుట, మరియు తీర్పుకు సంబంధించిన సందర్భములలో భూకంపములు బైబిల్‌లో తరుచుగా పేర్కొనబడినవి (1 రాజులు 19:12; మత్తయి 24:7; అపొస్తలుల కార్యములు 16:26; ప్రకటన 6:12; 8:5; 11:13, 19; 16:18).[7] యేసు సిలువవేయబడిన సందర్భములోను, ఆయన పునరుత్థానుడైన సందర్భములోను భూమి కంపించినది (27:51; 28:2).

ఈ విషయంలో, మత్తయి మరియు మార్కు ఒక్క దూతనే పేర్కొన్నారు. "తెల్లని నిలువుటంగీ ధరించుకొనియున్న యొక పడుచువాడు" అంటూ మార్కు ఆ దూతను వర్ణించుచున్నాడు (మార్కు 16:5). మరొక ప్రక్క, "ప్రకాశమానమైన వస్త్రములు ధరించిన యిద్దరు మనుష్యులు" అని లూకా చిత్రీకరించుచున్నాడు (లూకా 24:4). యోహాను కూడ "తెల్లని వస్త్రములు ధరించిన యిద్దరు దేవదూతలు" సమాధి యొద్ద ఉండిరని చెప్పుచున్నాడు (యోహాను 20:12). మత్తయి, జంటమాటలను తరచుగా ప్రయోగించాడు, సువార్తల ఇతర రచయితలు ఒక్క మాటనే ఉపయోగించారు (8:28; 20:30; 21:2పై గల వ్యాఖ్యానములను చూడు).

ఈ తేడా ఎందువలన వచ్చినది? మత్తయి మరియు మార్కు సందేశములో ప్రధాన సారాంశమును తెలియజెప్పిన ఒకని గూర్చి నొక్కివక్కాణించుచుండగా, స్త్రీలతో యిద్దరు దేవదూతలు మాటలాడారని లూకా సూచించుచున్నాడు (లూకా 24:5). వారు వెవ్వేరు దృక్పథములను తెలియజెప్పారు, వెవ్వేరు అనేక మనుష్యులను మరియు యిద్దరు దేవదూతలను పేర్కొన్నారు. బహుశా, ఒక దేవదూత ప్రాముఖ్యమైన స్థలములో నిలిచియుండగా, రెండవ దూత మరొక తక్కువ ప్రాముఖ్యత గల చోట నిలిచియుండవచ్చును. మొత్తానికి ఎప్పుడో ఒకప్పుడు, ఈ ఇద్దరు దేవదూతలు స్త్రీలతో మాటలాడారు. ప్రాముఖ్యమైన వివరాలను నాలుగు సువార్తల రచయితలు మనకు సమకూర్చారు.

**ప్రభువు దూత పరలోకము నుండి దిగి వచ్చి రాయి పొర్లించి దాని మీద కూర్చుండెను** (27:60పై గల వ్యాఖ్యానము చూడు). ఒక గొప్ప శక్తి – దేవదూత శక్తి – ఆ రాయిని సమాధి మీద నుండి పొర్లించినది, భూమిని కంపింపజేసినది. దేవదూత సమాధిపై ఉంచబడిన రాయిని పొర్లించినప్పుడు, యూదుల నాయకులు దానిపై వేసిన ముద్రను నలుగగొట్టాడు (27:66పై గల వ్యాఖ్యానము చూడు). మన కొరకు ఆ రాయిని ఎవరు పొర్లిస్తారు? అని స్త్రీలు తమలో తాము చర్చించుకొనుచుండిన సమస్యను సహితము పరిష్కరించాడు (మార్కు 16:2, 3). దేవదూత ఆ రాయిపై కూర్చుండుట దేవుడు చేసిన ముగింపును, ఆయన అధికారమును, మరియు ఆయన ముఖ్యోద్దేశమును తెలియజెప్పుచున్నది.

**వచనము 3.** దేవదూతలు **హిమము వంటి ప్రకాశమానమైన తెల్లని వస్త్రములు ధరించుకొనినవారై యుండిరి** (మార్కు 16:5; లూకా 24:4; యోహాను 20:12 చూడు). మత్తయి సువార్తలో వివరించబడిన వర్ణన దేవదూత స్వరూపము ఎంత ధగధగలాడుచుండెనో చిత్రీకరించుచున్నది. "మెరుపు" "పరలోక జీవుల స్వరూపము (దానియేలు 10:6), సాతాను పతనము (లూకా 10:18), మరియు మనుష్యకుమారుని రాకడకు (మత్తయి 24:27) సంబంధించినదై యున్నది."[8] లేఖనములలో, తెల్లని వస్త్రములు పవిత్రతను మరియు పరిశుద్ధతను సూచించినవి (దానియేలు 7:9; మత్తయి 17:2; ప్రకటన 3:4, 5, 18; 4:4; 6:11; 7:9, 13, 14; 19:14). "హిమము వలె తెల్లని" అను మాటలు బైబిలు సంబంధమైన ఒక సర్వసాధారణమైన పోలిక కూడ అయియున్నది (కీర్తనలు 51:7; యెషయా 1:18; దానియేలు 7:9; ప్రకటన 1:14).

**వచనము 4.** సమాధి యొద్ద కావలిగా ఉంచబడిన **కావలివారు** భయపడిపోయారు మరియు **భయము వలన వణకి చచ్చినవారివలె ఉండిరి** (ప్రకటన 1:17 చూడు) రాబర్ట్ హెచ్. గుండ్రి మాటల్లో, "ఇచ్చట ఒక విపర్యయమైన/వ్యతిరేకమైన వ్యంగ్యము గమనింపబడుచున్నది, యేసు సజీవుడై యుండగా కావలివారు చచ్చినవారి వలె ఉండిరి."[9] అటుతరువాత, వారు తిరిగి మేల్కొనినప్పుడు, వారిలో కొందరు యెరూషలేము పట్టణము లోనికి వెళ్లి జరిగిన విషయమును ప్రధాన యాజకులకు వివరించారు (28:11).

**వచనము 5.** సమాధి యొద్దకు వచ్చిన **స్త్రీలు** ఆ రాయి పొర్లింపబడి యుండుట చూచి ఎంతో ఆశ్చర్యపడి యుందురు కదా! సమాధిని భద్రము చేయుటకు ఉంచబడిన రాయి యేసు సమాధిలో నుండి వెలుపలకు వచ్చుటకు సౌకర్యవంతముగా నుండవలెనని పొర్లింపబడలేదు; ఆ రాయి అది ఉంచబడినట్లుగా, ఉంచబడిన చోటనే ఉండినప్పటికిని యేసు ఎలాగైనా సమాధిలో నుండి లేచి వెలుపలకు వచ్చెడివాడే.[10] దానికి బదులుగా, ఆయన శిష్యులు సమాధిలోనికి చూడగలుగునట్లు లేక, ప్రవేశించగలుగునట్లు పొర్లింపబడినది! సమాధి లోనికి ప్రవేశించిన తరువాత, స్త్రీలు యేసు దేహము అక్కడ లేదని గమనించారు, గనుక "వారికేమియు తోచక యుండిరి" (లూకా 24:3, 4).

**దేవదూత** ఆ స్త్రీలతో, **మీరు భయపడకుడి** అని వారికి అభయమిచ్చాడు. అనేక సందర్భములలో, వారు సెలవిచ్చుచుండిన మాటలకు తొలిపలుకులుగా దేవదూతలు ఈ మాటలనే ఉపయోగించారు (1:20; లూకా 1:13, 30; 2:10). దైవికమైన వార్తాహరులుగా, వారు నీతిమంతులను భయపెట్టుటకు రాలేదు.[11] దానికి బదులుగా, దేవుడు సమస్తమును వారి మేలు కొరకే సమకూర్చునని వారికి ఆదరణ నిచ్చుటకు దేవదూతలు వచ్చారు. దేవుని

యుందు నమ్మకముంచుట చింతించుటకును, భయమునకును విరుగుడై యున్నది.

ఇంకా, **సిలువవేయబడిన యేసును మీరు వెదకుచున్నారని నాకు తెలియునని** కూడ దేవదూత చెప్పాడు. ఆ స్త్రీలు సిలువవేయబడిన యేసు దేహమును వెదకుచూ వచ్చారని దేవదూత ఎరిగియుండెను (1 కొరింథీయులకు 1:23; 2:2; గలతీయులకు 3:1).

**వచనము 6.** అరిమతయియ యోసేపు యేసు దేహమును పాతిపెట్టుచుండగా చూచిన ఈ స్త్రీలు (27:61) ఇప్పుడు సమాధి ఖాళీగా నుండుట గమనించి విస్మయమొందుచున్నారు. దేవదూత ఈ రెండు పరిస్థితులకు నడుమ లోపించుచున్న విషయమును సమకూర్చాడు: **ఆయన లేచియున్నాడు**; గ్రీకు క్రియా పదము (*ēgerthē*; *egeirō* నుండి) కర్మార్థకములో నున్నందు వలన, "ఆయన లేపబడి యున్నాడు" అని కొన్ని బైబిలు భాషాంతరీకరణములలో వ్రాయబడి యున్నది (TEV; NEB; NRSV; NLT; JNT). కర్మార్థకము, ఈ ప్రక్రియలో దేవుని కార్యశీలత ఉన్నదను ధ్వనింపు నిచ్చుచున్నది. "దేవుడాయనను సజీవునిగా లేపాడను" అనువాదముతో ఈ అభిప్రాయమును CEV భాషాంతరీకరణము సుస్పష్టము గావించుచున్నది. యూదుల నాయకులు యేసును సిలువవేసారు, జీవాధిపతిని చంపారు; కానీ దేవుడాయనను మృతులలో నుండి లేపాడు (అపొస్తలుల కార్యములు 3:14, 15).

సువార్తల రచయితలు యేసు యొక్క వాస్తవ పునరుత్థానమును వర్ణించలేదు, ఆయన ఆత్మ తన దేహమును ఎప్పుడు పునరుజ్జీవింపజేసినదో తెలియజెప్పలేదు. ఆయనకుండిన ప్రేత వస్త్రములు తీసివేయబడుట (యోహాను 20:4–7 చూడు) లేక సమాధిలో నుండి వెలుపలికి వచ్చుట గూర్చి వారు చెప్పలేదు. దానికి బదులుగా, వారు నివేదించిన వివరాలు ఇలా ఉన్నవి: (1) సమాధి ఖాళీ అయ్యింది, (2) యేసు మరలా సజీవుడయ్యాడు, మరియు (3) ఆయన పునరుత్థానము రూఢిపర్చుకొనబడుచుండిన ప్రక్రియ కొసాగుచుండినది.

పునరుత్థానము, యేసు పదే పదే ప్రవచన రీతిగా పలుకుచుండిన పలుకుల నెరవేర్పై యుండినదని **తాను చెప్పినట్టే** అను పదజాలము సూచించుచున్నది (27:62, 63పై గల వ్యాఖ్యానము చూడు). ఆయన తన శిష్యులతో ఎల్లప్పుడు, భరించుటకు వారికి కష్టముగా ఉండినప్పుడు సహితము, సత్యమునే చెప్పాడు (16:21–23; 26:21, 22, 31–35). యేసు తన మరణ పునరుత్థానముల గూర్చి వారికి ముందుగానే తెలియజెప్పిన వివరములు ఆయన నిజముగా సజీవుడై యున్నాడను సత్యమును ఆయనను వెంబడించుచుండినవారు నెమ్మదిగా అంగీకరించునట్లు సహాయము చేసినవి (లూకా 24:6, 8).

సమాధి యొద్దకు వచ్చిన స్త్రీలు సమాధి లోనికి చూసారని స్పష్టముగా తెలియుచున్నప్పటికిని (లూకా 24:3), వారు సమాధికి సమీపముగా వచ్చి పరిశీలనగా చూడవలెనని దేవదూత వారిని ఆహ్వానించాడు: **రండి, ప్రభువు పండుకొనిన స్థలము చూడుడి.** యేసు దేహము ఆ చోట లేదను సందేహము వారి మనస్సుల్లో ఉండకూడదని దేవదూతలు ఆశించారు.

కొందరి పునరుత్థానము గూర్చి బైబిల్ తెలియజెప్పుచున్నప్పటికిని – అత్యధికంగా యేసు పరిచర్య చేయుచుండిన రోజుల్లో – యేసు సొంత పునరుత్థానము అసమానమైనదై యుండినది. అంతకు మునుపు లేపబడినవారు రెండవసారి మరణించారు. యేసైతే ఎన్నటికినీ మరణించనట్లు మరలా లేపబడినాడు (రోమియులకు 6:9). ప్రతి యూదుడు తన సొంత మరియు ప్రజలందరి శరీర పునరుత్థానమును నిరీక్షించాడు; ఈ ఆదివారం

ఉదయమున ఆ ప్రగాఢ వాంచకు యేసు వింతైన ప్రథమఫలమయ్యాడు (1 కొరింథీయులకు 15:20, 23).[12] ఈ విషయం నిజమై యుండగా, నిత్య జీవమునకైన పునరుత్థానము యేసు క్రీస్తునందు విశ్వాసముంచి ఆయనను లోబడువారికి మాత్రమే చెందినదని గుర్తుంచుకొనవలెను (1 కొరింథీయులకు 15:57, 58).

**వచనము 7.** వారు **త్వరగా వెళ్లి యేసు సజీవుడైయున్నాడను సత్యమును ఆయన శిష్యులకు తెలియజెప్పవలెనని** దేవదూత ఆ స్త్రీలతో చెప్పాడు. దైవికమైన వార్తాహరుడు ప్రత్యేకంగా పేతురుకు తెలియజెప్పవలెనని చెప్పాడు (మార్కు 16:7). పేతురు యేసును ఎరుగనని ముమ్మారు బొంకాడు (26:69–75) కాబట్టి అతనిలో నిశ్చయమైన నిరీక్షణ కలిగించుటకు ఈ ఉత్తరువు జారీ చేయబడినదనుటలో సందేహము లేదు.

యేసు **గలిలయ లోనికి వారికి ముందుగా వెళ్లుచున్నాడని** కూడ శిష్యులకు తెలియజెప్పవలెనని స్త్రీలు ఆజ్ఞాపింపబడిరి. "ఆయన మీతో చెప్పినట్టు" అను అదనపు మాటలు మార్కు 16:7లో కలవు. ఈ నిర్దేశనము ఆయన సిలువ మరణము నొందక మునుపు యేసు వారికి ఆదేశముల నిచ్చిన దాని ప్రకారమైనదై యుండినది (26:32పై గల వ్యాఖ్యానము చూడు).

యేసు మరియు ఆయన అపొస్తలులు వారందరికి సుపరిచితమైన ఒక చోట – యేసు నిర్దేశించిన కొండ యొద్ద – కలసికొందురు (28:16). వారందరు నివసించినది గలిలయ ప్రాంతమే. యేసు తన పరిచర్యను అత్యధికంగా చేసిన ప్రాంతము కూడ గలిలయనే గలిలయలో, యెరూషలేము నాయకులు వలన వారికి ఎటువంటి జోక్యమైనను కలుగదు.

### ఆశ్చర్యచకితులైన సాక్షులు (28:8–10)

**8 వారు భయముతోను మహా ఆనందముతోను సమాధియొద్దనుండి త్వరగా వెళ్లి ఆయన శిష్యులకు ఆ వర్తమానము తెలుప పరుగెత్తుచుండగా, యేసు వారిని ఎదుర్కొని– మీకు శుభమని చెప్పెను. 9 వారు ఆయనయొద్దకు వచ్చి, ఆయన పాదములు పట్టుకొని ఆయనకు మ్రొక్కగా, 10 యేసు–భయపడకుడి; మీరు వెళ్లి, నా సహోదరులు గలిలయకు వెళ్లవలెననియు వారక్కడ నన్ను చూతురనియు వారికి తెలుపుడనెను.**

**వచనము 8.** స్త్రీలు ఘర్షనపడుచుండు భావోద్రేకములతో నిండిన హృదయములతో **సమాధి యొద్ద నుండి త్వరగా వెళ్లిపోయారు**. "వారు బయటకు వచ్చి, విస్మయము నొంది వణకుచు సమాధి యొద్ద నుండి పారిపోయిరి; వారు భయపడినందున, ఎవరితో ఏమియు చెప్పలేదని" మార్కు 16:8 సెలవిచ్చుచున్నది. వారు దేవదూతలను చూచినందువలనను, భయభీతిని గొలుపు పునరుత్థాన సమాచారము వినినందువలనను **భయము** చేత పట్టబడిరి. ఆ అనుభవము వారిని హితకరమైన భక్తిభావముతో, నిర్మాణాత్మకమైన భయముతో నింపివేసినది. క్రీస్తు మృతులలో నుండి లేపబడినాడను వార్త (28:6) వారికి **మహా ఆనందమును** కలుగజేసినది. వారు అప్పటికి యింకా యేసును చూడనప్పటికిని. దేవదూతలిచ్చిన సాక్ష్యము మరియు వారు చూచిన ఖాళీ సమాధి మూలమున వారికి ఒక ప్రక్క భయము మరొక ప్రక్క మహా ఆనందము కలిగినవి. తత్ఫలితంగా, ఆ స్త్రీలు త్వరగా వెళ్లి **ఆ వర్తమానమును ఆయన శిష్యులకు తెలియజేయవలెనని పరుగెత్తిరి**.

**వచనము 9.** వారు వెళుచుండిన మార్గములో, **యేసు వారిని ఎదుర్కొని వారికి శుభము కలుగుగాకని** చెప్పాడు ఈ సమయంలో, వారు పునరుత్థానుడైన యేసును తమ కళ్లారా చూచుటకు ఒక ప్రత్యేకార్హత వారికి లభించినది. గనుక వారు శిష్యులను కలిసికొనినప్పుడు, పునరుత్థానము గూర్చిన వారి సాక్ష్యము కొత్తది కానిదై యుండుట మాత్రమే కాదు కానీ అది తాజా సమాచారమై యుండును.

ఆ స్త్రీలు **ఆయన యొద్దకు వచ్చి, ఆయన పాదములు పట్టుకొని ఆయనకు మ్రొక్కిరి.** "మ్రొక్కిరి" (*proskuneō*) అను పదము మత్తయి వ్రాసిన సువార్తలో పదమూడు పర్యాయములు అగుపించును. కొన్ని పర్యాయములు అది ఒకడు మరొకరి యెడల కలిగియున్న ఆదరాభిమానములనుబట్టి అతని పాదములకు మ్రొక్కుటను సూచించున్నది, కానీ ఇతర సందర్భములలో అది ఆధ్యాత్మిక ఆరాధనను సూచించుచున్నది. 9 మరియు 17వ వచనములో, ఈ పదము రెండవ అర్థముతో ప్రయోగింపబడినది (2:2పై గల వ్యాఖ్యానము చూడు). యేసు తన దైవత్వమునుబట్టి ఇటువంటి గౌరవమును పొందాడు (14:33). దీనికి తారతమ్యముగా, క్రొత్త నిబంధనలో దేవదూతలు మరియు మనుష్యులు ఇట్టి గౌరవమును తృణీకరించారు (అపొస్తలుల కార్యములు 10:25, 26; 14:11–15; ప్రకటన 22:8, 9).

**వచనము 10.** దేవదూత చేత వారికి తెలియజెప్పబడిన సమాచారమును వారు వెళ్లి శిష్యులకు అందించవలెననని యేసు ఆ స్త్రీలతో చెప్పాడు (28:7): **భయపడకుడి; మీరు వెళ్లి సహోదరులు గలిలయకు వెళ్లవలెననియు, వారక్కడ నన్ను చూతురనియు వారికి తెలుపుడి.** యేసు మృతులలో నుండి లేపబడినాడను సువర్తమానమును పంచుకొనుటకు ఏర్పరచుకొనబడినవారిలో *స్త్రీలు* మొట్టమొదటివారై యుండిరనునది గణనీయమైన విషయమై యున్నది. ఈ వివరము సువార్తలలో గ్రంథస్థం చేయబడిన నివేదికల యథార్థతను సోదాహరణంగా చిత్రీకరించుచున్నది. డగ్లస్ ఆర్. ఏ. హేర్ ఇలా చెప్పుచున్నాడు, "యూదుల న్యాయస్థానములలో సాక్ష్యమిచ్చుటకు స్త్రీలు సామర్థ్యముగలవారుగా పరిగణింపబడలేదు గనుక, ఈ వృత్తాంతములో వారుండుట ఇతరుల దృష్టిలో ఒక సదభిప్రాయమును కలిగించుటకు పేర్కొనబడలేదని హామీ ఇచ్చుచున్న విషయము స్పష్టముగా నున్నది."[13]

యేసు ఈ స్త్రీలను కలిసికొనిన తరువాత యెరూషలేములో ఏమి జరిగినదో మత్తయి మనకు తెలియజెప్పుట లేదు. వాటి కాలక్రమానుగత వివరములను నిశ్చయతతో పునఃనిర్మాణము చేయుట కష్టమైనదై యున్నప్పటికిని, ఇతర సువార్తలు ఆ యా సంఘటనలకు సంబంధించిన కొన్ని రికార్డులను సమకూర్చుచున్నవి.

ఎట్టకేలకు శిష్యులు యేసును గలిలయలో కలిసికొననై యుండినప్పటికిని (28:16), వారు దాదాపుగా ఒక వారము రోజులు యెరూషలేములోనే నిలిచిపోయారు – ఈ వారము రోజుల్లో పులియని రొట్టెల పండుగ అయిపోతుంది. ఈ కాలములో యేసు వారికి అనేక సందర్భములలో అగుపించాడని ఇతర సువార్తలు సూచించుచున్నవి. యేసు పునరుత్థానుడైనది మొదలుకొనని ఆయన ఆరోహణమగు వరకు నలుబది రోజుల కాల వ్యవధిలో యేసు అగుపించిన ఇతర సందర్భములు కూడ కలవు (అపొస్తలుల కార్యయములు 1:3).

## అబద్ధ నివేదిక (28:11-15)

**[11]వారు వెళ్లుచుండగా కావలివారిలో కొందరు పట్టణములోనికి వచ్చి జరిగిన సంగతులన్నిటిని ప్రధాన యాజకులతో చెప్పిరి. [12]కాబట్టి వారు పెద్దలతో కూడి వచ్చి ఆలోచనచేసి ఆ సైనికులకు చాల ద్రవ్యమిచ్చి [13]- మేము నిద్ర పోవుచుండగా అతని శిష్యులు రాత్రివేళవచ్చి అతనిని ఎత్తికొనిపోయిరని మీరు చెప్పుడి; [14]ఇది అధిపతి చెవినిబడినయెడల మేమతని సమ్మతిపరచి మీకేమియు తొందరకలుగకుండ చేతుమని చెప్పిరి. [15]అప్పుడు వారు ఆ ద్రవ్యము తీసికొని తమకు బోధింపబడినప్రకారము చేసిరి. ఈ మాట యూదులలో వ్యాపించి నేటివరకు ప్రసిద్ధమైయున్నది.**

భద్రత నిమిత్తము సమాధి యొద్ద రోమా ప్రభుత్వ కావలివారు ఉంచబడుట గూర్చి, సువార్తల రచయితలలో, మత్తయి మాత్రమే మనకు తెలియజెప్పాడు (27:62-66). వారు దేవదూతను చూచి భయపడిన విషయం (28:4) మరియు వారు యూదులలో వ్యాపింపజేసిన అబద్ధ నివేదిక గూర్చి కూడ మత్తయి పేర్కొన్నాడు (28:11-15).

**వచనము 11.** (రోమాప్రభుత్వ) **కావలి వారిలో కొందరు** - వారి తొలి దిగ్భ్రాంతి నుండి కోలుకొనిన తరువాత (28:4) - పట్టణములోనికి వచ్చి జరిగిన సంగతులన్నిటిని **ప్రధాన యాజకులతో చెప్పిరి**. ఈ సైనికులు ప్రధాన యాజకుల అధికారము క్రింద ప్రభుత్వాధికారి, పిలాతు చేత కాపలాగా ఉంచబడిరి (27:62, 65, 66). ఈ హేతువునుబట్టి, వారు వెళ్లి ప్రధాన యాజకులకు చెప్పారు. దీనికి తోడుగా, యేసు దేహము సమాధిలో నుండి వెలుపలకు వెళ్లకుండా వారు నిరోధించలేకపోయారని వారి సొంత పైఅధికారుల యెదుట ఒప్పుకొనుటకు వారు భయపడి యుందురు. యేసు దేహము అపహరింపబడకపోయినప్పటికిని, సంశయాత్మకమైన రోమా అధికారుల ముందు జరిగిన సత్యమును తెలియజెప్పుట వారికి కష్టమైన పనై యుండును.[14]

సైనికులు **జరిగిన సంగతులన్నిటిని** ప్రధాన యాజకులను తెలియజెప్పారు. సంగతులు "అన్నిటిని" అనంటే, మత్తయి అర్థమేమిటో? వారు భూకంపమును అనుభవించారు, దేవదూతను చూసారు, మరియు సమాధి ఖాళీయైనదని గమనించారు (28:4). దేవదూత స్త్రీలతో, "ఆయన ఇక్కడ లేడు, తాను చెప్పినట్టే, ఆయన లేచియున్నాడు" అని చెప్పిన (28:6) ఘోషణను కూడ వీరు వినియుండవచ్చును.

**వచనములు 12, 13.** వారికి సైనికులు తెలియజెప్పిన వివరముల చేత తీవ్ర కలవరము కలిగింపబడినవారై, ప్రధాన యాజకులు **పెద్దలతో కూడి వచ్చి ఆలోచన చేసిరి**. జరుగునేమో యని వారు భయపడుచుండిన విషయమే, జరుగకూడదని చాలినన్ని ముందు జాగ్రత్తలు తీసికొనిన సంగతే (27:64-66), ఇప్పుడు జరిగిపోయింది. దేహము లేదు, సమాధి ఖాళీ అయ్యింది, యేసు లేచాడను వార్త రానే వచ్చింది. సమాధి ఖాళీ అయ్యిందనుటకు కావలివారే సాక్షులై యుండిరి, గనుక వారి నివేదికను ఎవరును కాదనలేకపోయారు.[15]

తరువాతి చర్యల గూర్చి యూదుల నాయకులు తర్జనభర్జనలు చేసిన తరువాత, లంచమిచ్చుటయే మంచిదని తీర్మానించుకొన్నారు. **ఆ సైనికులకు చాలా ద్రవ్యమిచ్చారు.** "చాలా ద్రవ్యము" అని అర్థమిచ్చుచున్న గ్రీకు పదజాలము (*arguria hikana*), "చాలినంత వెండి" లేక "చాలినంత డబ్బు" అని కూడ అనువదింపబడవచ్చును. అనగా, అది

కావలివారిని సంతృప్తిపర్చుటకు "చెప్పుకోదగినంత భారీ లంచమై" యుండినది (NEB). వారికివ్వబడిన లంచమునకు ప్రతిగా కావలివారు, **మేము నిద్రపోవుచుండగా అతని శిష్యులు రాత్రివేళ వచ్చి అతనిని ఎత్తికొనిపోయిరను** అబద్ధ వదంతులను వ్యాపింపజేయాలి. ఈ కట్టుకథ - ఎవరూ కాదనలేని విషయము - సమాధి ఎందుకు ఖాళీ అయ్యిందో తెలియజెప్పుటకు సహేతుకమౌతుందని, యూదుల నాయకులు అనుకొన్నారు.

ఈ మిథ్య నిజముగా ఎంత హాస్యాస్పదమైనదై యున్నదో ఆ సమయములోని శిష్యుల చిత్తవృత్తి ప్రదర్శించుచున్నది. యేసు పట్టబడిన తరువాత ఆయన శిష్యులందరు భయముతో పారిపోయారు (26:56). యేసుకు తీర్పు తీర్చబడుచుండగా దూరము నుండి చూచుచుండిన పేతురు, యేసును ఎరుగనని ముమ్మారు బొంకాడు (26:69-75). యేసు సిలువవేయబడుట వలన శిష్యులు నిరాశతో ఏమిచేయవలెనో ఎటుతోచక యుండిరి (లూకా 24:21). యేసు మృతులలో నుండి తిరిగి లేచాడను సమాచారము తెలిసికొనిన తరువాత కూడ, శిష్యులు యింకా భయపడుచునే మూయబడిన తలుపుల వెనుక సమావేశమయ్యారు (యోహాను 20:19, 26). వీరు యేసు దేహము కొరకు రోమా ప్రభుత్వ కాపలాదారుని సవాలుచేయలేకపోయారు. యేసు దేహమును దొంగతనముగా ఎత్తుకొనిపోయి ఆయన మృతులలో నుండి లేచాడని సాధికారంగా వారు చెప్పుకొనినను అది వారి కార్యక్రమములకు ఎటువంటి బలమును చేకూర్చలేకుండినది, ఏలయనగా వారి మనస్సుల్లో యింకా ఐహిక రాజ్య స్థాపన గూర్చిన ఆలోచనయే మెదలుచుండినది (26:51; అపొస్తలుల కార్యములు 1:6).

**వచనము 14.** నిద్రపోవుట మరియు సమాధి భద్రతలో విఫలులగుట వలన అది వారి ప్రాణాలకే ముప్పు తెచ్చిపెట్టి యుండును. కాబట్టి, ఈ అసత్య సమాచారము **అధిపతి చెవినిబడిన యెడల,** వారికి పిలాతు విధించు శిక్ష వలన ఎటువంటి తొందరయైనను కలుగకుండ చూచుకొను బాధ్యత వహించుదురని ప్రధాన యాజకులు సైనికులకు హామీ ఇచ్చారు.

**వచనము 15.** ఇట్టి హామీ ఆధారంగా సైనికులు **ఆ ద్రవ్యము తీసికొని తమకు బోధింపబడిన ప్రకారము చేసిరి.** తత్ఫలితంగా, **ఈ మాట యూదులలో వ్యాపించి ప్రసిద్ధమై యున్నది.** ఇటువంటి అబద్ధ మాటలను ప్రజలు ఎందుకు నమ్ముదురో అర్థంచేసికొనుట కష్టమే. వాస్తవముగా, కావలివారు నిద్రించుచుండినట్లయితే, ప్రభువు దేహము ఏమయ్యిందో వారికి ఎలా తెలుస్తుంది?

**నేటి వరకు** అను అదనపు పదజాలము (11:23 చూడు), మత్తయి ఈ సువార్తను రచించుచుండిన రోజుల్లో ఆ వార్త యింకను ప్రసారమగుచునే యుండినదని సూచించుచున్నది, అప్పటికి యేసు పునరుత్థానుడై దాదాపు ముప్పది వర్షములు గతించియుండును జస్టిన్ మార్టియార్ ప్రకారము, ఈ వంచన రెండవ శతాబ్దములో సహితము ప్రాముఖ్యమైనదై యుండినది. యేసు "శిష్యులు రాత్రివేళ వచ్చి ఆయన సిలువ మీద నుండి దింపబడిన తరువాత ఉంచబడిన సమాధిలో నుండి ఆయనను ఎత్తికొనిపోయారు, అంతమాత్రమేగాక యేసు మృతులలో నుండి లేచి పరలోకమునకు ఆరోహణుడయ్యాడని రూఢిగా చెప్పుచు వారు మనుష్యులను మోసపుచ్చుచున్నారని యూదులు మాటలాడుకొనుచుండిరి."[16]

## పునరుత్థానము తరువాత ప్రత్యక్షతలు
## (అధ్యాయము 28)

యేసు నిజముగా మృతులలో నుండి లేచాడని చెప్పుటకు మన యొద్ద రుజువులేమున్నవి? పునరుత్థానుడైన తరువాత యేసు మొత్తము, పన్నెండు పర్యాయములు (పౌలుకు కనబడిన దానితో కలుపుకొని) ప్రత్యక్షమయ్యాడని మనము లేఖనములలో చదువుదుము. పునరుత్థానము చారిత్రాత్మకమును, నిశ్చయమునైన నిత్య సత్యమై యున్నది. "ఆయన శ్రమ పడిన తరువాత, నలువది దినముల వరకు వారి కగపడుచు, దేవుని రాజ్యవిషయములను గూర్చి బోధించుచు, అనేక రుజువులను చూపి వారికి తన్నుతాను సజీవునిగా కనుపరుచుకొనెనని" లూకా రచించాడు (అపొస్తలుల కార్యములు 1:3).

యేసు మగ్దలేనే మరియకు అగుపించాడు (మార్కు 16:9; యోహాను 20:14–17), మరియు సమాధి యొద్ద నుండి వెళ్లిపోవుచుండిన అనేక మంది స్త్రీలకు అగుపించాడు (28:9, 10). ఆయన ఒంటరిగా నుండిన పేతురుకు అగుపించాడని లూకా మరియు పౌలు ద్వారా తెలిసికొనుచున్నాము (లూకా 24:34; 1 కొరింథీయులకు 15:5). ఎమ్మాయు గ్రామమునకు వెళ్లుచుండిన ఇద్దరు శిష్యులకు కూడ మార్గములో అగుపించాడు, వారిలో ఒకడు క్లేయోపా అని గుర్తింపబడినాడు (లూకా 24:13–35). అపొస్తలులందరు ఒక చోట కూడుకొని యుండినప్పుడు యేసు వారికగుపించాడు – మొదటిసారి తోమా లేడు (యోహాను 20:19, 24) మరియు తరువాతి వారములో తోమాతో పాటు, వారందరు కూడికొని యుండినప్పుడు వారికగుపించాడు (యోహాను 20:26). అటుతరువాత ఆయన గలిలయ సముద్ర తీరమున ఏడుగురు అపొస్తలులకు అగుపించాడు (యోహాను 21:1–23). మత్తయి వ్రాయుచున్న దాని ప్రకారము, ఆయన వారికి ముందుగానే వాగ్దానము చేసినట్లుగా, ఆయన గలిలయ ప్రాంతంలోని పేరు తెలియని ఒక కొండపై అపొస్తలులకు అగుపించాడు, మరియు ఆయన తన మహా ఆదేశమును జారీ చేసినది ఆ కొండపై నుంచే (28:18–20). ఒక్కసారి ఐదు వందల కంటె ఎక్కువ మంది శిష్యులకును, ఆయన సహోదరుడైన యాకోబునకును యేసు అగుపించాడని పౌలు రచించాడు (1 కొరింథీయులకు 15:6, 7). అటుతరువాత ఆయన ఆరోహణము కాకమునుపు పదనొకండు మంది శిష్యులకు అగుపించాడు (లూకా 24:50, 51 అపొస్తలుల కార్యములు 1:3–12). "అందరికి కడపట అకాలమందు పుట్టినట్టున్న నాకును కనబడెనని" పౌలు రచించాడు (1 కొరింథీయులకు 15:8).

యేసు ప్రభువు మృతులలో నుండి తిరిగి లేపబడనట్లయితే ఏర్పడియుండునను వ్యతిరేకార్థక పర్యవసానముల గూర్చి ప్రస్తావించిన తరువాత, "ఇప్పుడైతే, నిద్రించినవారిలో ప్రథమఫలముగా క్రీస్తు మృతులలో నుండి లేపబడియున్నాడని" పౌలు రచించాడు (1 కొరింథీయులకు 15:20). లాజరు సహోదరియైన మార్తతో యేసు, "పునరుత్థానమును జీవమును నేనే; నాయందు విశ్వాసముంచువాడు చనిపోయినను బ్రదుకును, బ్రదికి నాయందు విశ్వాసముంచు ప్రతివాడు ఎన్నటికిని చనిపోడని" సెలవిచ్చాడు (యోహాను 11:25, 26). యేసు మృతులలో నుండి లేపబడి యున్నాడు గనుకనే మనము పౌలుతో కలిసి, "అయినను

మన ప్రభువైన యేసు క్రీస్తు మూలముగా మనకు జయము అనుగ్రహించుచున్న దేవునికి స్తోత్రము కలుగునుగాక" అని ధైర్యముతో చెప్పగలము (1 కొరింథీయులకు 15:57).

## ఆయన లేచియున్నాడు! (28:1-17)

వాటిపై వ్రాయబడిన/చెక్కబడిన మాటలేవైనను, "జీవించియుండెను కానీ మృతుడైనవాడు ఇప్పుడు ఇచ్చట ఉంచబడినాడు" అని సమాధుల ఫలకములు ప్రకటించుచుండును. దీనికి తారతమ్యముగా, యేసు సమాధి, ఖాళీ అయ్యింది; అది పూర్తిగా భిన్నమైన సందేశమును ప్రకటించినది. యేసు మరణించిన దినము చరిత్రయందంతటిలో అత్యంత అంధకారమయమైన దినమై యున్నది, కానీ మూడు దినముల తరువాత ఈ దృశ్యమంత పూర్తిగా మారిపోయింది. యేసు యింకా మృతులలోనే ఉండినట్లయితే, "మనుష్యులందరి కంటె దౌర్భాగ్యులమై యుందుమని" పౌలు రచించాడు (1 కొరింథీయులకు 15:19).

న్యాయసమ్మతమైన ఏ ఆధారముపై మనము పునరుత్థానములో విశ్వాసముంచగలము?

*పునరుత్థానము ప్రవచింపబడినది* (28:6). అది పాత నిబంధనలో ప్రవచింపబడినది (కీర్తనలు 16:8-11; యెషయా 53:10-12; హోషేయ 6:2), మరియు యేసు తన పునరుత్థానము గూర్చి తానే తరుచుగా మాటలాడాడు (16:21; 17:23; 20:19; 27:40, 63; యోహాను 2:19).

*పునరుత్థానము రుజువుచేయబడినది* (28:7-10). సాక్షుల చేత అది రూఢిపరచబడినది, అంతమాత్రమే గాక ఖాళీ సమాధి అందుకు మరొక తిరుగులేని నిదర్శనమై యుండినది. దీనికి తోడుగా, యేసు మృతులలో నుండి లేచాడని మార్పునొందిన ఆయన శిష్యుల జీవితములు రుజువు చేసినవి. పునరుత్థానుడైన ప్రభువుకు నేటి సంఘము సాక్ష్యముగా నిలుచుచున్నది.

*పునరుత్థానము అనుమానాస్పదముగా అంగీకరింబడినది* (28:11-17). పునరుత్థానము గూర్చిన రుజువులుండినప్పటికిని, మొదటి నుండి కూడ ప్రజలు అనుమానించుచునే యుండిరి. పునరుత్థానము గూర్చిన అనుమానములను తొలగించుటకు వివరములతో కూడిన ఎన్నో ప్రయత్నములు చేయబడినవి.

అయితే, పునరుత్థానము వలన కలుగు ప్రయోజనమేమిటి? పునరుత్థానమును విశ్వసించి దానిని అంగీకరించువారి జీవితములలో అది నిత్య మేలును సమకూర్చుతుంది!

## యేసు సజీవుడై యున్నాడు! (28:1-10)

అరిమతయియ యోసేపు మరియు నీకొదేము కలిసి యేసు దేహమును యోసేపు తనకు స్వంతగా తొలిపించుకొనిన సమాధిలో ఉంచిన తరువాత, వారు సబ్బాతు కొరకు సిద్ధపడుటకు తమ ఇళ్లకు వెళ్లిపోయారు. కథ అంతటితో ముగిసియుంటే, మనము విచారములోనే మునిగియుండుటకు ఎన్నో కారణములుండేవే - ఏలయనగా మనము నిరీక్షణ లేని లోకములో జీవించియుందుము. "ఈ జీవితకాలము మట్టుకే మనము క్రీస్తు నందు నిరీక్షించువారమైన యెడల మనుష్యులందరి కంటె దౌర్భాగ్యులమై యుందుమని" పౌలు కొరింథీ సంఘమునకు వ్రాసియున్నాడు (1 కొరింథీయులకు 15:19). ఎందుకు దౌర్భాగ్యులమై యుంటాము? ఎందుకనగా, క్రీస్తు మృతులలో నుండి లేపబడి యుండని

యెడల, మన విశ్వాసము మరియు మనము చేయు ప్రకటన వ్యర్థమే, యేసు మృతులలో నుండి లేచిన తరువాత వారు ఆయనను సజీవునిగా చూసారని చెప్పిన అపొస్తలులు మరియు ఇతరులందరు అబద్ధికులౌదురు, మనము యింకను మన పాపములలోనే నిలిచియుందుము, ప్రభువునందు నిద్రించినవారు నశించియుందురు, మరియు ఈ లోకము రక్షకుడు లేనిదై యుండును (1 కొరింథీయులకు 15:14–18)! ఇందుకు తారతమ్యముగా, "కానీ ఇప్పుడైతే నిద్రించినవారిలో ప్రథమ ఫలముగా క్రీస్తు మృతులలో నుండి లేపబడి యున్నాడని" పౌలు రూఢిపర్చుచున్నాడు (1 కొరింథీయులకు 15:20). యేసు "మృతులలో నుండి పునరుత్థానుడైనందున పరిశుద్ధమైన ఆత్మనుబట్టి దేవుని కుమారుడుగా ప్రభావముతో నిరూపింపబడెనని" పౌలు మరొక చోట చెప్పుచున్నాడు (రోమీయులకు 1:2–7).

యేసు మరణించిన రోజు అక్షరాలా మరియు అలంకారికంగాను మానవ చరిత్రలో అత్యంత అంధకారమయమైనదై యుండినది. ఆయనకు అత్యంత సన్నిహితులై యుండినవారు సహితముగా ఆయనను యికముందెన్నడైనను సజీవునిగా చూచెదరని విశ్వసించలేదు. ఆయన శిష్యులు యెరూషలేములో ఎక్కడో ఒక మేడ గదిలో ఉండి తలుపులు మూసివేసికొన్నారు (యోహాను 20:19). ఆయన పరిచర్య చేయుచుండిన రోజుల్లో చనిపోయిన ఇతరులను ఆయన మరలా బ్రతికించిన సంఘటనలు వారు కళ్లారా చూచినప్పటికిని, ఆయన సజీవుడగునని వారు నిజముగా నమ్మలేదు. ఏది ఏమైనా, ఆదివారము నాడు, ఆయన దేహము సమాధిలో లేదను సమాచారము అంతటా వ్యాపించుచుండినపుడు అదంతా మారిపోయింది. ఒకరి తరువాత మరొకరు ఆయనను వెంబడించుచుండినవారు ఆయనను సజీవునిగా చూచినట్లు ఆశ్చర్యకరమైన విషయాలను పంచుకొనుటకు మొదలుపెట్టారు. కొందరు ఆయనతో కూడ నడిచారు, ఆయనతో మాటలాడారు, ఆయనతో కూడ భోజనము చేసారు. కాబట్టి వారు వినుచుండిన వార్తలన్నీ కొందరు లోతైన వారి దు:ఖము చేత ఉన్మాదులైన అనుచరులు భ్రమచెంది తెలియజెప్పుచుండినవి కావని త్వరలోనే విశదముగా విదితమైపోయింది. యేసు నిజముగా సజీవుడై యుండెను! సజీవుడై యున్నాడు! ఈ ఒక్క వాస్తవము సమస్తమును అత్యంత ఆర్భాటముగా మార్చివేయును.

### యేసును వెంబడించిన స్త్రీలు (28:1–10)

యూదుల సమాజములో స్త్రీలు కొన్ని పర్యాయములు అత్యల్పులుగా పరిగణింపబడినప్పటికిని.[17] యేసు వారిని ఎంతో గొప్పగా గౌరవించాడు. దేవుడు స్త్రీని సృజించినపుడు ఏ దృక్పథంతో చేసాడో, చూచాడో, యేసు కూడ స్త్రీలను ఆ దృష్టికోణంలో చూసాడు. యేసు పరిచర్యలో స్త్రీలు వహించిన పాత్రలు ఈ క్రింది విధముగా నున్నవి.

1. రక్షింపబడుటకు పురుషుల వలెనే సమానులై యుండిరి (యోహాను 4:1–42).
2. ఆయన శిష్యులై యుండుటకు పిలువబడిరి (12:48–50).
3. ఆదేశములను అందుకొనిరి (లూకా 10:38–42).
4. యేసు పరిచర్యలో ఉపచారము చేసారు (లూకా 8:1–3).
5. యేసుతో కూడ ప్రయాణం చేసారు (27:55, 56).
6. ఆయన ఎదుర్కొనుచుండిన అత్యంత అంధకారమయమైన గడియలలో సహితము ఆయన యెడల విశ్వసనీయమైనవారై యుండిరి (27:55, 56).

7. ఆయన పునరుత్థానమును గూర్చి మొట్టమొదట ప్రచురపరచారు (28:7, 10; మార్కు 16:9, 10; లూకా 24:1–10; యోహాను 20:18).[18]

దేవిడ్ స్టూవర్ట్

**మగ్దలేనే మరియ (28:1)**

చరిత్రలో అతిగా అపార్థము చేసికొనబడిన స్త్రీలలో మగ్దలేనే మరియ నిస్సందేహముగా ఒకర్తైయె యున్నది. ఆమె వేశ్య యని పిలువబడుచున్నది, కానీ ఇది నిజమని క్రొత్త నిబంధనలో ఎచ్చోటనైనను ఈ విషయము గూర్చిన ఊసే లేదు. ఆమె యేసును మరులుగొల్పుటకు ప్రయత్నించినదనియు లేక ఆయనకు భార్యయై యుండినదనియు ఆధునిక కాల్పనిక సాహిత్యం ఆమెను చిత్రీకరించుచున్నది. ఈ మరియ వ్యభిచారములో పట్టబడిన స్త్రీ అనియు (యోహాను 8:1–11) లేక, యేసు పాదముల చెంత ఏడ్చుచు ఆయన పాదములను తన తలవెంట్రుకలతో తుడిచి, ముద్దుపెట్టుకొని, ఆ తరువాత అచ్చ జటామాంసి అత్తరుతో అభిషేకించిన పాపపు స్త్రీ అనియు (లూకా 7:37, 38) అనేకులు తప్పుగా అనుకొనుచుందురు. వీరిలో ఆమె ఏ ఒక్కర్తైయైనను కాదు, అలాగైతే ఆమె ఎవరు?

మరియ, గలిలయ సముద్రముపు నైరుతి తీరమున నుండిన మగదల ప్రాంతమునకు చెందినది (15:39పై గల వ్యాఖ్యానము చూడు). ఆమె యేసును ప్రేమించినది, కానీ వారి సంబంధములో లైంగికపరమైనదేదియును లేదు. యేసు ఆమెలో నుండి ఏడు దయ్యములను వెళ్లగొట్టాడు కాబట్టి ఆమె ఆయనను ప్రేమించుటకు అదొక సహేతుకమై యుండినది (మార్కు 16:9; లూకా 8:2). అటుతరువాత ఆమె యేసును భక్తిశ్రద్ధలతో వెంబడించుచు, ఆయన పరిచర్యకు ఆర్థిక సహాయమును అందజేసినది (లూకా 8:2, 3). యేసు మరణించినప్పుడు సిలువకు సమీపమున నిలువబడి యుండి చిట్టచివరగా వెళ్లిపోయినవారిలో ఈమె ఉండినది (27:56; మార్కు 15:40; యోహాను 19:25), మరియు పునరుత్థాన దినమందు పెందలకడనే సమాధి యొద్దకు మొట్టమొదట చేరినది ఈమెయే (మార్కు 16:1). మార్కు 16:9 ప్రకారము, పునరుత్థానుడైన యేసు మొట్టమొదట ప్రత్యక్షమైనది ఈ మరియకే.

---

సూచనలు

[1]Walter Bauer, *A Greek-English Lexicon of the New Testament and Other Early Christian Literature,* 3d ed., rev. and ed. Frederick W. Danker (Chicago: University of Chicago Press, 2000), 746. [2]Ibid., 386. [3]Ibid., 909-10. [4]ఈ పదజాలము అపొస్తలుల కార్యములు 20:7లో కూడ కలదు, అది రొట్టె విరుచుటకు శిష్యులు కూడుకొనిన సందర్భమై యున్నది. ఆ వచనములో, NEBలోని ఈ పదజాలము, “శనివారము రాత్రి” అని తప్పుగా అనువదింపబడి యున్నది. [5]“ఆదివారమున ఇంకను చీకటిగా ఉన్నప్పుడు … పెందలకడ సమాధి యొద్దకు వచ్చెను” అని మగ్దలేనే మరియ గూర్చి యోహాను వర్ణించాడు (యోహాను 20:1). యోహాను మగ్దలేనే మరియ పేరు మాత్రమే పేర్కొన్నాడనునదియు, అప్పటికి ఇంకా చీకటిగానే ఉన్నదను వాస్తవము ఆధారంగా, యోహాను పేర్కొనుచున్నది సమదృక్పథ సువార్తలలో గల సందర్భము కాదు కానీ అంతకు మునుపటిదై యుండునని కొందరు విద్వాంసులు చెప్పుచున్నారు. ఏది ఏమైనా, నాలుగు సువార్తలలో గల వివరములన్నింటిని ఒక్క చోట ఉంచినప్పుడు, ఆమె ఇతర స్త్రీలతో కూడ పెందలకడనే వచ్చినదని స్పష్టమగుచున్నది. ఆమె ఇతర స్త్రీలతో కలిసి వచ్చినప్పటికిని యోహాను ఆమె ఒకర్తెపైనే తన దృష్టి నిలుపుచున్నాడు. దీనికి తోడుగా, అప్పటికి సూర్యోదయమగుటకు యింకా కొంచెము సమయముండినది కాబట్టి అది చీకటిగానే ఉండినది. ఇతర సమదృక్పథ సువార్తల రచయితల వలెనే యోహాను కూడ ఈ సన్నివేశమును వర్ణించుచుండెను, కానీ మరొక దృష్టికోణములో

వర్ణించాడు. [6]Michael J. Wilkins, "Matthew," in *Zondervan lllustrated Bible Backgrounds Commentary*, vol. 1, *Matthew, Mark, Luke,* ed. Clinton E. Arnold (Grand Rapids, Mich.: Zondervan, 2002), 185. D. R. Bowes, "Earthquakes," in *The Zondervan Pictorial Encyclopedia of the Bible*, ed. Merrill C. Tenney (Grand Rapids, Mich.: Zondervan Publishing House, 1975), 2:179 లోని పటమును చూడు. [7]Jack P. Lewis, *The Gospel According to Matthew*, Part 2, The Living Word Commentary (Austin, Tex.: Sweet Publishing Co., 1976), 169. [8]Ibid. [9]Robert H. Gundry, *Matthew: A Commentary on His Literary and Theological Art* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1982), 588. [10]పునరుత్థానుడైన దేహముతోనే, యేసు గోడల గుండా సహితము వెళ్లుటకు సమర్థుడై యుండెను (యోహాను 20:19, 26).

[11]భయముతో వణకుచుండిన కావలివారికి ఆదరణను కలుగజేయు ఎటువంటి మాటలతోనైనను దేవదూత వారిని సంబోధించలేదను విషయమును గమనించండి. [12]Wilkins, 185. [13]Douglas R. A. Hare, *Matthew*, Interpretation (Louisville: John Knox Press, 1993), 331. Josephus *Antiquities* 4.8.15; Mishnah *Rosh Hashanah* 1.8 చూడు. [14]Leon Morris, *The Gospel according to Matthew*, Pillar Commentary (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1992), 740. [15]Lewis, 171. [16]Justin Martyr *Dialogue with Trypho* 108. [17]Joseophus *Against Apion* 2.25 చూడు. వారి అధమమైన స్థితి "స్త్రీలు, బానిసలు, మరియు చిన్నవారు" అను సూత్రములో బంధిపబడి యున్నది (Mishnah *Sukkah* 2.8; *Berakoth* 3.3). [18] Wilkins, 181 నుండి అనుకూలించుకొనబడినది.

**పునరుత్థానము తరువాత 40 రోజుల కాల వ్యవధిలో క్రీస్తు అగుపించిన సందర్భములు**

| | |
|---|---|
| 1. సమాధి యొద్ద మగ్దలేనే మరియకు అగుపించుట | మార్కు 16:9–11;<br>యోహాను 20:11–18 |
| 2. సమాధి యొద్ద నుండి వెళ్లిపోయిన స్త్రీలకు అగుపించుట | మత్తయి 28:8–10 |
| 3. యెరూషలేములో పేతురుకు అగుపించుట | లూకా 24:34;<br>1 కొరింథీయులకు 15:5 |
| 4. ఎమ్మాయు మార్గములో ఇద్దరు శిష్యులకు అగుపించుట | మార్కు 16:12, 13;<br>లూకా 24:13–32 |
| 5. యెరూషలేములోని మేడ గదిలో పది మంది శిష్యులకు (తోమా లేడు) అగుపించుట | మార్కు 16:14;<br>లూకా 24:36–43;<br>యోహాను 20:19–25 |
| 6. యెరూషలేములోని మేడ గదిలో పదనొకండు మంది అపొస్తలులకు (తోమా ఉన్నాడు) అగుపించుట | యోహాను 20:26–29;<br>1 కొరిథీయులకు 15:5 |
| 7. గలిలయ సముద్ర తీరమును ఏడుగురు అపొస్తలులకు అగుపించుట | యోహాను 21:1–23 |
| 8. పదకొండు మంది శిష్యులకు గలిలయలోని కొండ మీద అగుపించుట | మత్తయి 28:16–20;<br>మార్కు 16:15–18 |
| 9. 500 కంటె ఎక్కువ మంది శిష్యులకు అగుపించుట | 1 కొరింథీయులకు 15:6 |
| 10. యేసు సహోదరుడు, యాకోబుకు అగుపించుట | 1 కొరింథీయులకు 15:7 |
| 11. ఒలీవల కొండ మీద అగుపించుట | మార్కు 16:19;<br>లూకా 24:44–53;<br>అపొస్తలుల కార్యములు 1:3–8;<br>1 కొరింథీయులకు 15:7 |